


# సిన్మా జీవులా! చిరంజీవులా!

భానుమతీ రామకృష్ణ




దీపావళి వారం రోజులుందనగా నేను షాపింగ్‌కి వెళ్లాను.... మామూలుగా ప్రతి సంవత్సరం దీపావళి అనవాయితీలు మాకు తప్పవు గనక, స్టూడియో పని వాళ్లకూ, ఆఫీసు పనివాళ్లకూ, యింట్లో పనివాళ్లకూ, ఆ తర్వాత మాకూ బట్టలూ వగైరా కొని, చివర్లో మర్నాడు శుక్ర వారం గనక పూలూ పండ్లూ కొనడానికీ, యింకా యింటికొక్కావాల్సినవేమో మావారు వాడుకోవాలంటే పాండీబజారు వేపు పొమ్మన్నాను డ్రైవర్‌తో....

నేను పాండీబజారుకు వెళ్తే కార్లో కూర్చుని ఏంకావాలో చెప్పి తెప్పిస్తానే గాని కారుదిగి షాపుల్లోకి వెళ్లే అలవాటు లేదు.... కావాల్సిన వస్తువులేవో చెప్పి ఆఫీసు కుర్రాణ్ణీ, డ్రైవర్నీ కొట్లోకి పంపించాను....

పాండీబజారు రెండువేపులా బార్లు తీర్చిన పెద్దపెద్ద నిద్రమొఖం చెట్లతో (తమిళంలో తూంగు మూంజి మరంగళ్ అంటారు) గొడుగులు పట్టినట్లు రోడ్డంతా చల్లటినీడ తివాచీ పరిచాయాన్నట్లుంది.

ముఖ్యంగా పాండీబజారెప్పుడూ సినిమావాళ్లతో కిటకిటలాడుతుంటుంది... సినిమావాళ్ల కష్టసుఖాలూ, కథలూ వినీవినీ పాండీబజార్లో చెట్లన్నీ సినిమా చెట్లయిపోయాయి....

నా కారు పక్కనించే ఎవరో సినిమా




వ్యక్తి వెళ్తూ వెళ్తూ కార్లోవున్న నన్ను గుర్తుపట్టి "నమస్కారం అమ్మా! బాగున్నారా! షాపింగ్‌కు వచ్చారా" అన్నాడు.

"ఆ! అవునండీ! వచ్చేది పండుగ గదా!" అన్నాను. ఆయన ఎవరో గుర్తురాక యిబ్బందిపడుతూ.... ఆయనొక నిట్టూర్పుతో "అవునమ్మా వున్నవాళ్ళకి పండగలేగాని రోజుగడవడమే కష్టంగా వున్న నాబోటి అరడజను మంది పిల్లలు గలవాడికేం పండుగ చెప్పండి!.... యీ మధ్య ఏ వేషాలూ దొరకడం లేదు.. అంతా కొత్తవాళ్లు వచ్చారు!.... ఈ బోడి పాతయాక్టర్ని ఎవరు గుర్తుంచుకొంటారు!...." అని అతను బాధతో చెప్తూంటే అర్థంచేసుకుని పర్సులోంచి కొంత. డబ్బు తీసి అతని చేతులలో పెట్టాను.... సంతోషంతో ఉక్కిరిబిక్కిరైన అతను "అమ్మా! మీరూ మీవారూ మీ బిడ్డా, మీ మనవలూ, మీ కుటుంబం అంతా ఎల్లప్పుడూ క్షేమంగా, సుఖంగా, వర్ధిల్లాలని ఆ భగవంతుణ్ణి కోరుకుంటున్నాను....వస్తానమ్మా" అంటూ దీవించి వెళ్ళిపోయాడు.... నా మనసు తేలికపడ్డది....

"శభాష్! మంచిపని చేశావమ్మాయ్!...." అంటూ ముక్కిపోడి బలంగా పీల్చిన చప్పుడైంది. చుట్టూ చూశాను!.... ఎవరూ లేరు!.... చెట్టొక్కటే వుంది నా కారుపక్క! ఆ గొంతూ ఎక్కడో విన్నట్టుంది!....

"ఏంటమ్మాయ్! అట్లా చూస్తున్నావ్! నేను సి.యస్.ఆర్‌ని! మీ 'చక్రపాణి' పిక్చర్లో మీ తాతయ్యని!_ గుర్తుందా!_ వుంటుందిలే.... 'తప్పకా యిచ్చురా తాతయ్యా లక్ష!' అని పాడావే! ఆ తాతయ్యని!_ నేను మంచి 'ఆర్టిస్టునని నువ్వు చాలామందికి చెప్పడం నేవిన్నాను గనక, నువ్వు నన్ను మర్చిపోలేదని తెల్సు నాకు!...."

"ఏమిట్రా యీ దయ్యంగాడు యీ చెట్లోనించి మాట్లాడుతున్నాడు! అని ఖంగారు పడుతున్నావా!.... భయపడకు!.... సినిమావాళ్ళకి చావు బ్రతుకులొకటేగా!_ యీ పాండీబజార్లో చచ్చిపోయిన మన సినిమా వాళ్లంతా యీ చెట్లకిందనే తిరుగుతుంటాను వాళ్లతో బాతాఖానీ కొడుతుండడమే నా పని! ఆ గీతా కేఫూ, యీ చెట్టూ నే వదిలిపెట్టలేదమ్మాయ్! అంత అలవాటయిపోయింది చోటు! ....

మళ్లీ పొడుం పిల్చిన శబ్దం.

భయంతో బిగుసుకుపోయాను!_ యింతలో చెట్టుమీదనుంచి ఎండిన రెమ్మ ఒకటొచ్చి కార్లోపడ్డది గాలికి.


"నమస్కారం అమ్మా, బాగున్నారా!_ నేనొక చిన్న ప్రొడ్యూసర్ని కాని పెద్ద టేస్టుగలవాణ్ణి!.... కళాత్మకమైన చిత్రాలు తీయాలనే ఆరాటం, తపన కలవాణ్ణి."

"ఏడిశావ్! ఆలోచనలోటేగదా తడిసి ముప్పందయి వగం పిక్చేర్లో దివాలా తీశావ్"_ ఒద్దమ్మాయ్. 'చక్రపాణి' మళ్లీ తీయి. రెండువిధాలా లాభదాయకంగా వుంటుంది. మీరు చక్రపాణి తీసినప్పుడు ప్రపంచం ఆడియన్సు యింత అడ్వాన్సుగా లేరు!_ అసలు మీ చిత్రాలన్నీ పదిహేను యిరవై ఏళ్ల 'అహెడ్' తీశారు అందుకే ఆనాడు మీ చిత్రాలన్నీ హైక్లాసని మెచ్చుకున్నారు!_ కాని మీరు తీసిన ఆ చిత్రాలే ఇప్పుడొస్తే డబ్బూ, కీర్తీ రెండూ బ్రహ్మాండంగా వచ్చేవి!_"

మళ్ళీ పొడి పీల్చిన శబ్దం వినిపించింది....

'నిధి చాలా సుఖమా! రాముని సన్నిధి చాలా సుఖమా!...' పాట వినిపించింది.... రేడియోలో వస్తోందేమోనని చుట్టూ చూశాను కాని నా పక్కనుంచే "బాగున్నావా అమ్మా" అన్నారు ఎవరో! ఉలిక్కిపడ్డాను!_ అది నాగయ్యగారి గొంతు- భయంతో మరికాస్త బిగుసుకుపోయాను-

"ఆ త్యాగరాజకృతి ఎంత బాగా పాడావమ్మా! మొన్న టి.వి.లో వివాహబంధం వేశారు. ఆ ముందున్న కొట్లో చూశాను!_ ఆహా ఎంత మంచి పిక్చెరమ్మా!_ అలాంటి పిక్చర్లు తీసి త్యాగరాజకృతులు మరికొన్ని వినిపించమ్మా- అన్నట్లు వి.ఎ.కె. రంగారావు నీ ప్రాణాలు తోడేస్తుంటాలే, శాస్త్రీయ సంగీతం రికార్డులిమ్మని! నువు పాడాలమ్మా!_ నీ గాత్రం, నీ సంగీతం భగవానుడిచ్చిన వరప్రసాదం!.... నాకు పాటంటే ఎంత యిష్టమో చివరిరోజుల్లో




పాటా పద్యంలేని వేషాలేసి జీవశ్చవంలా జీవించాను. అన్ని పిక్చర్లల్లోనూ చచ్చిపోయే వేషాలే యిస్తూ వచ్చారు!– ఏం నువ్వుగూడా 'అంతా మనమంచికే' పిక్చర్లో మధ్యలోనే చంపేశావ్‌గా! దీనికంటే ఒకేసారి చచ్చిపోవడం మేలనుకున్నా!.... నా విరక్తికి కారణం లేకపోలేదు ...

"చివర్రోజుల్లో నేనొక పిక్చర్ చేశాను. నేను ఎప్పుడూ నాకింత యిమ్మని అడగను!.... నా గౌరవం తగ్గకుండా వాళ్లకి తోచింది నాకిస్తారనే నమ్మకంతో. పైగా నాకొచ్చేవన్నీ గెస్టు వేషాలే గదా!.... నాకు తగినవిధంగా ఆ ప్రొడ్యూసరూ యిస్తాడనుకున్నా!.... తీరా వేషం పూర్తయ్యాక రెండువందల రూపాయలు నా చేతిలో పెట్టబోయాడు. ఆ సమయంలో నా స్థితి ఎలా ఉంటుందో వూహించమ్మా!"–ఆయన కంఠం గాద్గదికమైంది,.... నా మనసంతా వికలమై బాధతో గుండె పిండేసినట్లయింది!.... ఆ ప్రొడ్యూసరు ఎవరో తెలిస్తే అమాంతం వెళ్లి బుర్ర బద్దలుకొడదామనిపించింది.

"ఆ వేళ పడకమ్మా! ప్రస్తుత ప్రపంచం తీరు యిదీ!– అందుకే అంత విరక్తి కలిగింది. నిజమైన కళకూ, కళాకారులకూ వాల్యూ పోయిందమ్మా. ఏ పసలేకపోయినా పబ్లిసిటీతో పైకెళ్లేవాళ్లకి రోజులివి."

యిలోగా మరో కారొచ్చి నా పక్కనే ఆగినట్లయింది?.... చుట్టూ చూశా. ఏ కారూ కనిపించలా!.... కాని కారు తలుపుతీసి మళ్లీ తలుపువేసిన చప్పుడైంది!– అంతేగాకుండా సిగరెట్ గట్టిగా ఒక దమ్ము పీల్చిన శబ్దం!– తక్షణం నా కారుతలుపు పక్కనుంచి "ఏమ్మా మల్లీశ్వరీ! బాగున్నావా!...." అని అడగడం వినిపించింది!– బి.యన్. రెడ్డిగారి గొంతు!.... గుండె గతుక్కుమంది!

"అన్నట్లు నీకు గుర్తుందామ్మాయ్! మన మల్లీశ్వరిలో ఒక సీన్లో ఒద్దన్నా వినకుండా నీ జుట్టు కాస్తముఖంమీదికి ఉంగరాలు ఉంగరాలుగా వదిలావ్! .... దానివల్ల ఆ సీను కాస్త చెడిపోయిందని నేను యిప్పటికీ బాధపడుతూ కనిపించిన వాళ్లందరికీ చెప్తుంటా! .... నిజానికి నువ్వు ఆ సీన్లో జుట్టు కాస్త సాఫీగా దువ్వి.... ఆ జుట్టు...."

బాబోయ్? మొదలెట్టాడు! .... నా గుండె వేగంగా కొట్టుకోడం మొదలెట్టింది.... డ్రైవర్ అని గట్టిగా అరిచాను! .... డ్రైవర్ కనిపించలా! యిలోగా "ఆదిపోనీలే బ్రదర్! .... యీ సంగతి ఎన్నివేలసార్లు ఎన్నివందల మందితో చెప్పివుంటావ్ చెప్పు!...." కె. వి. రెడ్డిగారిగొంతు బి.యన్.రెడ్డిగారి పక్కనే వినిపించింది! ...."

"అసలు నీచాదస్తం గాకపోతే అంత చిన్నవిషయం పైగా అది నీకు బాగోలేదుగాని జనానికి బాగోలేదన్లేదుగా! .... మల్లీశ్వరిగా ఆమె అద్భుతంగా పాడిందీ, బ్రహ్మాండంగా 'యాక్టు'చేసిందీ, అప్పటికీ యిప్పటికీ అదొక 'మైల్‌స్టోన్'గా నిల్చిపోయింది! .. చాల్దూ! యికనైనా ఆమె జుట్టు ఒదిలిపెట్టు! .... ఏమ్మా బ్రదర్ బాగున్నాడా?.... ఏదో యీ మధ్య ఒంట్లో బాగాలేదనీ, డాక్టర్ క్లబ్‌కెళ్ళగూడదూ, సిగరెట్ తాగకూడదూ అని బ్రదర్‌తో చెప్పాడంటనే!– పో నీ ఆ రెండూ మానేస్తే పోలా!– హెల్తు బాగవుద్దిగా!"

"ఏంటి బాగయ్యేది బొచ్చు!"– అటుక్లబ్బూ, యిటు సిగరెట్టూ రెండూ లేకపోతే మనిషి బతుక్కి అర్థం ఏముందంట!... "

చక్రపాణిగారి గొంతు!.... నా కారు వెనకనుంచి వినిపించింది .... నా కు ప్రాణం లేచొచ్చింది!... చక్రపాణిగారి సంభాషణ వింటం నాకు చాలా సరదా!... అందులోనూ బి.యన్., కె.వి. గార్లతో కలిసినప్పుడు ఆయన సంభాషణ చాలా ఇంట్రెస్టింగ్‌గా వుంటుంది!

"ఆదిగాదు బ్రదర్!....నువ్వు'చైన్' స్మోకరువి! అందరూ నీలాగా పరసబట్టి సిగరెట్లుకాలిస్తే ఏమౌతారు!–" అన్నారు కె. వి.

"ఏం! ఏమౌతారూ!– 'సింగిల్ లంగోటీ' నేనే కాలవటంలేదా ఎన్నోఏళ్లు!– పీళ్ళకేం ఒచ్చింది దొబ్బుడాయి! .... అసలది గాదులే?.... ఒంట్లో 'సాల్ట్సు' చాల్లా. అదీసంగతి_"అదివిన్న బి.యన్. రెడ్డిగారు నవ్వుకుంటూ:

"బ్రదర్ కె. వీ. మొదలెట్టాడు




మందు పార్టీ ఇప్పిస్తానని చెప్పి ఇదేమిటోయ్?!

చక్కన్న వైద్యం.... బోర్! ....

"బోరేంటంట బొచ్చు నీ ఒంట్లో 'సాల్ట్సు' చాలవనేగా హెల్తుపోయింది! సాల్ట్సన్నీ ఒంట్లో సమంగా వుంటేనే ఒళ్లు బాగుంటది. 'మన పిక్చర్లలాగానే' ఎవరేషం బాగలేకపోయినా గబ్బే! .... కె.వి.రెడ్డి పోతనలాగా 'హరిశ్చంద్ర' తీయగలిగాడా! .... అసలు యన్. టి. రామారావు ఆడదాన్లా ఏడిస్తే ఎవడు జూస్తాడంట! .... అదే రామారావు ఒక కత్తితీసుకొని నూరుమందిని ఒక్క దెబ్బతో కిందపడేస్తే చప్పట్లు కొట్టి చూస్తారుగానీ, హరిశ్చంద్రెవరు చూశారు.... బి. యన్. వి మాత్రం "స్వర్గసీమ, మల్లీశ్వరి' యిరగబటి చూశారుగానీ చివర్లో తీసిన రాజమకుటం ఎవుడుజూశాడు! .... అదే విఠలాచార్య తీస్తే చూపేటోళ్ళు"– తనకి తెలిందాంట్లో తల్దూరిస్తే ఏమవుద్ది! — నే నప్పుడే ఒద్దన్నా....."

"ఆరంభం అయింది బ్రదర్! పద– యీ చక్కన్నకీ నాకూ ఎప్పుడూ ఉప్పూనిప్పే.... నీకు తెలుసుగా.... పోతా నమ్మా.పద కె.వీ!..." అంటూ బి.యన్. రెడ్డిగారు మరొకసారి గట్టిగా సిగరెట్ దమ్ము పీల్చి కె. వి. రెడ్డిగార్తో వెళ్లిపోయారు!

"వున్నమాటంటే ఉలుకే! యీళ్లెప్పుడిన్నారు గనక నామాట!....

"యింతకీ దీపావళికి 'యువ' కి కథ పంపావా"... నావైపు తిరిగారు చక్కన్నగారు – హతోస్మి....గుటకలు మింగాను ... మాటపెగల్లా!....

"పరిత్రాణాయ సాధూనాం
వినాశాయచ దుష్కృతాం
ధర్మసంస్థాపనార్థాయ సంభవామి
యుగే యుగే!

ఘంటసాలగారి గొంతు! – రేడియోలో వస్తోందేమోనని చుట్టూ చూశాను–! —. కాదు – నాకారు పక్కనే వినిపించింది చివర్లో "నమస్కారం అమ్మా! నమస్కారం చక్కన్నగారూ".... అన్నాడు ఘంటసాల.

"ఊ! బంగారంలాంటి గొంతు ఆ నాటుమందు ఏదో తిని నాశనంచేసుకున్నావ్ గదయ్యా" అన్నారు చక్కన్న..
........

"అవును బాబూ! – గొంతుపోయి కొంతకాలం నేను వుండినా...."

"గొంతుపోయాక నువ్వుండి ఏం ప్రయోజనంలే ఘంటలేని గుడిలాగా టాకీలేని మూకీ సినిమాలాగా...." అన్నాడు చక్కన్న!....

"అవునుబాబూ అదీ నిజమే! త్వరగా నయం అవుతుందని ఆశపెట్టి ఆ నాటు వైద్యుడు పాదరసం ఏదో యిచ్చాడు! – దాంతో గొంతూ పేగులూ వుడికిపోయి నోరంతా పట్టేసింది...."

"అది నీ బుద్ధితక్కువ!.... విజయా హాస్పిటల్లో వుండి నర్సులిచ్చే పళ్లరసం తాగడానికి బదులు నాటుమందోడిచ్చిన పాదరసం తాగితే యింతకంటే ఏమవుద్ది!.... అందుకే ఆత్రగాడికి బుద్ధి మట్టమన్నారు పెద్దోళ్లు! ...."

"అది సరే నీకొడుకులు పాడుతున్నారంటనే. నీ పేరు చెడగొట్టకుండా చూసుకో."

"అదేబాబూ మీలాంటి పెద్దల ఆశీర్వాదాలతో....

యీ కాలంలో ఆశీర్వాదాలేం జేస్తాయిలే! .... రికమెండేషన్లో వుంది అంతా! .... దాంతోగూడా మ్యూజిక్ డైరక్టర్ సరేఅంటే గొంతెట్టన్నా పైకి లాగేస్తారు .... ప్రొడ్యూసర్ దేముంది డైరక్టర్ దేముంది! .... ఏది ఏమైనా నీ పిల్లలు నీ అంత పాటకులు కాలేరు!.... రాసిస్తా...."

"అదేంటి చక్కన్నా? శుభం పలకరా అంటే – అన్నట్లుంది నీవుచెప్పేది! పాపం పిల్లలు బాగానేపాడుతున్నారు..." యస్. వి. రంగారావుగారి గొంతు వినిపించింది! —

"నాకదే అరికాలిమంట! పాపం పిల్లలేంటి! వాళ్లకేం తక్కువ! చదువుకున్నారు. బాగా 'తెలివైనోళ్లూ' చిన్నోడు పెద్దోడికంటే చురుకైనోడు పైకొస్తారు! కాని పాట పాడతాం అని వాళ్ల తండ్రిననుకరించడం తప్పంటా! హాబీగా పాడుకోవచ్చుగానీ, ఘంటసాల మళ్లీ పుడితే తప్ప వాళ్లెట్టా ఘంటసాలలవుతారూ"....

"నిజమే బాబూ మంచి గాత్రం, సంగీతం భగవంతుడిచ్చిన వర ప్రసాదం!" అన్నాడు.... ఘంటసాల.!

"ఎవుడిచ్చాడో నాకు తెలీదు– నీపాట నీ పాటే నీ గొంతు నీ గొంతే. నీలాగా ఎవుడూ పాడ్లేడు– అంతే!"

"అలా మమ్మల్ని చిన్నబుచ్చకండి చక్రపాణిగారూ. ఘంటసాలగారి గాత్రం గొప్పదే కానీ ఒకప్పుడు మేము బాగా పాడినవాళ్ళమే. నాపాట మీరు వినలేదా! నా ఈలపాటగూడా వినివుంటారే!" అంటూ చెట్టుమీదినుండి వినిపించింది! – కె. రఘురామయ్యగారి గొంతు! –– చక్రపాణిగా రోసారి చెట్టు పైకి చూసి–

"యీడికో యిదొక పీకులాట. కృష్ణుడి వేషంలో చెట్టెక్కి ఈలపాట పాడి పాడి చెట్టు దిగనంటాడు – మన మేమన్నా ఆవులమందలమా, ఆ యీల పాటా జోలపాటా యింటానికి –" సిగరెట్ వెలిగించారు చక్కన్న.

"చక్రపాణిగారూ! నా ఈలపాట అలా వుంచండి. నా హిందూస్తానీ సంగీతం మీరు విన్నారా! –

"యిన్నాలే – చిన్నప్పుడు నీపాటంటే చెవి కోసుకునేవాణ్ని! –

"అప్పరే! పాడేటప్పుడెందుకు వూరికే దవడలు కదిలిస్తావ్! –"

చక్కన్నగారి ప్రశ్నకు రఘురామయ్యగారు గతుక్కుమన్నారు.

వెంటనే సమాధానం చెప్పలేక పోయారు. కాస్త తేరుకుని,

"అదాండీ! హిందూస్తానీ సంగీతంలో చిరవాలూ గట్రా గొంతులో తిరగాల్సి వచ్చినప్పుడు, దవడలేంటి వళ్ళంతా కదుల్తుంది."

"అందుకే దాన్ని దవడ సంగీతం అనేవాళ్ళు కొందరు. అయినా నీ గొంతు వింటానికి హాయిగానే ఉండేది. ముఖ్యంగా పద్యాలు నాకిష్టం–"

"అయితే నేనొక పద్యం పాడనా చక్కన్నగారు!" అన్నాడు సి.యస్.ఆర్. ఒక్క చిటికె ముక్కుపొడుం పీల్చి....

"ఒద్దొద్దు! నీముక్కు సంగీతం ఆ గీతాకేపోడికి వినిపించు, నన్నొదులు–" అన్నాడు చక్కన్న విసుక్కుంటూ.

"అమ్మాయ్ నువ్వు నా 'ఫాన్' గదా, నాకు పిచ్చి అని లోకం అంతా అంటారే అసలుపిచ్చివరికిచెప్పు!" కాంచనమాల నా పక్కకివచ్చి అడుగుతోంది– గుండె జల్లుమంది –

"యిదొకతి! –– చచ్చినా పిచ్చి పోలేదు" గాణిగాడు చక్కన– పక పక నవ్వుతుంటూ వెళ్ళిపోయింది కాంచనమాల.

"అయ్యా నమస్కారం"– కడారు నాగభూషణంగారు – చక్కన్న గారి ముందాగాడు –.

"ఊ నువ్వా పాపం! కన్నాంబ పొయ్యాక తాడుతెగిన బొంగరంలాగా పానగల్ పార్కు చుట్టూ తిరగడమే నీపనయ్యింది". .

"ఏంచేస్తాం సార్! – పువ్వులమ్మినచోటనే కట్టెలమ్మడం కష్టంకదా! –"

"అది నీ బుద్ధితక్కువ– దీపం ఉండగానే యిల్లు చక్క దిద్దుకోవాల్సింది – నీపేర అంతో ఇంతో ఏసుకోంటే యీ పీకులాట ఉండేది కాదుగదా"

"నిజమేనండీ అంత దూరాలోచన లేకపోయింది –– ఏదో మన సినిమా ప్రముఖులంతా చివర్లో సహాయపడ్డారనుకోండి."

"ఎందుకా ముష్టంట. –– చివర్లో నువ్వేవన్నా అనుభవించావా పాడా. మళ్లీ బుద్ధితక్కువ పనేగా." –"నిజమే బాబు" కళ్ళనీళ్ళు పెట్టుకున్నాడు కడారు నాగభూషణం.

"వస్తా సార్ యిదంతా నా ప్రారబ్ధం అంటూ వెళ్లాడు...."

"ఊ ఆ అంటే అందరికీ యీ మాటొకటి తెలుసు!....

"అలా అనకండి చక్కన్నగారూ! ప్రారబ్ధం తప్పదు!.... లేకపోతే ఆరోగ్యంగా వున్న నేను యింటికొస్తూ ఎలక్ట్రిక్ ట్రెయిన్ల మధ్యనపడి పచ్చడై పోతానా సార్! దీనికేమంటారు!"....

కె. వి. చలం గొంతు! – చక్కన్న మనసులోనే బాధపడుతూ మాట్లాడలేదు. నాకూ కళ్లనీళ్లొచ్చాయి కె. వి. చలం పాపం!

"నా సంగతేమనమంటారు బాబూ! – కాళ్లు నడవనియ్యకపోయినా, ఏదో కిందామీదాపడి యాక్టుచేశాను! అదీ లేకుండా చివరికి కదల్లేకపోయానే –" రేలంగి ఏడుపు గొంతు కారు కిందవేపు వినిపించింది!

"అది నీ బుద్ధితక్కువ!.... చేపలు తింటే చాకులాగుండేవోడివి!– పీతలు తిన్నావ్ అదే యీ పీకులాట!..."

"అయ్యా చక్కన్నగారూ! నాకు పీతలంటే ప్రాణం. ఏంచేయనండీ!...."

"అందుకే చివరికి నువ్వూ ఒక పీతలా తయారయి పీతలా నడిచి పీత చచ్చినట్టుచచ్చావ్! .. డి" రేలంగి బావురుమని ఏడ్చాడు....


"యిప్పుడేడిస్తే ఏం లాభంలే!– ఒకళ్ల తర్వాత ఒకళ్లు కామిడియన్స్ చస్తే సినిమాల్లో కామిడియన్స్ లేక ప్రొడ్యూసర్లు చస్తున్నారు.... కాస్త డబ్బు రాంగానే పెద్దిల్లు చిన్నిల్లు తలతిక్కపన్లుచేసి యిప్పుడు ఏడిస్తే ఏం లాభంట!–"

"నిజమే బుద్ధితక్కువ పన్లే చేశా చక్కన్నా!..." మళ్లీ బావురుమన్నాడు రేలంగి కింద కూర్చునే – "భగవంతుడా నేనేం పాపం చేశాను" అంటూ....

"ఒకటీ రెండైతే గుర్తుంటాయి!.. " చక్కన్న మళ్లీ సిగరెట్ తీశాడు.

రేలంగి ఏడుపు ఎక్కువైంది కాళ్ల బాధతో. "వూరికే రోడ్డుమీద కూర్చొని అట్టా ఏడవబాక!.... యినేవాళ్లు ముష్టోడనుకోని అయిదు పైసలో పది పైసలో నీముందు పడేసిపోతారు".

"ఛా ఛా! నాకేం ఖర్మం చక్కన్నా! –



అన్నట్టు యిందాక మిలిటరీ హోటల్లో నా కోసం స్పెషల్‌గా పీతలు వండిపెట్ట మని చెప్పొచ్చా!.... ఆకలేస్తావుంది.. నేపోతా" అంటూ నడవలేని రేలంగి దోగాడుకొంటూ వెళ్లాడు! ....

"హాతోస్మి! వీడు చచ్చినా పీతలకి చావు తప్పలేదు" చెట్లోంచి సి.యస్.ఆర్ గొణుగుతూ మరో చిటిక పొడుం పీల్చాడు ఘాటుగా.

"అయితే నేనూ పోతా! దీపావళి కథ 'యువ'కు తొందరగా పోస్ట్‌చెయ్యి ఎప్పుడూ లేటుగానే పంపుతావ్....

యింతలోనే ఏదో గుంపులుగా చాలా మంది సినిమాజీవుల గొంతులు వినిపిం చాయి....

"బాబూ! చక్రపాణిగారూ! నమ స్కారం!.... మీతో ఎన్నోసార్లు మొర పెట్టుకొన్నాం.... ఉండేందుకు చోటులేక పగలు యీ పాండీబజారు చెట్లుపట్టు కునీ, రాత్రిళ్లు ఆ పానగల్ పార్కులో పడుకునీ, నానాపాట్లూ పడుతున్నాం.... ఏదన్నా ఉండేందుకో పాతబిల్డింగ్ చూద్దామంటే పాతవన్నీ పడగొట్టి కొత్త కొత్త 'ఫ్లాట్స్' కట్టేస్తున్నారు!.... మమ్మల్ని ఎక్కడికిపొమ్మంటారు?..."

"ఏట్లోకి!"– యియ్యన్నీ ఒట్టి కబుర్లు.... మీరీ పాండీబజారు ఒదిలి ఎక్కడికీపోరు... నే రాసిస్తా?.... ఊఁ! ఒకేళ అట్టపోయినా మీకు తోచదు పొద్దున్నే లేస్తే యీ పాండీబజార్లో మన సినిమావాళ్లని చూడకుండా సినిమా కబుర్లు వినకుండా మీకు పొద్దెట్టా పోద్ది!.... ఊఁ– మాట్లాడకుండా యీ చెట్లమీదనే పడుండండి. అన్ని రోడ్ల మీదా చెట్లు కొట్టేసినా గవర్నమెం టోళ్లూ మీకోసంగా అన్నట్లు యీ పాండీ బజారు చెట్లుమాత్రం కొట్టలా!... అందుకు సంతోషించండి!"– అన్నాడు చక్కన్న.

"అదికాదండీ!.... మేమంతా ఒక యూనియన్‌గా చేరి...."

"మొదలుబెట్టారూ!.... మీతో యిదే పేకులాట...., ఆ మాటంటేనే నాకు బి.పి. ఎక్కుద్ది!.... నే పోతా...." చక్కన్నగారు గుంపులోంచి త్వర త్వరగా వెళ్ళారు....చక్కన్నగారు పోగానే ఆ గుంపు నా కారువైపు చూసి ఆ కార్లో వున్నది భానుమతిగార్రా!.... భానుమతిగారే!.... అంటున్నారు గోలగా!....

నా కారు తలుపుతీసిన చప్పుడైంది! ఉలిక్కిపడి కండ్లు తెరిచాను!.... నా కారుకి రెండువేపులా చిన్న గుంపులు చేరారు!– "భానుమతి."– "భానుమతి!" అంటూ!.... తల గిర్రున తిరిగింది!

ఆలోచనల్లో నేను ఎంతసేపు కారు సీట్లో వెనక్కి చేరగిలబడి అలా ఎంత సేపు కూర్చున్నానో!.... ఎప్పుడు కునుకుపట్టిందో తెలియదు!.... సిగ్గుతో చిక్కిచచ్చిపోయినట్లయింది నా పని!–

డ్రైవరూ, ఆఫీసు కుర్రాడూ చుట్టూ చేరిన గుంపును పొండని అదిరించి, "అమ్మా! అన్నీ కొనుక్కొచ్చాం!– యింటికి పోవచ్చు!"– అని అడిగారు.

వెంటనే కారు స్టార్ట్‌చేయమన్నాను వంచిన తల ఎత్తకుండానే.... ఒళ్లంతా చెమటెక్కినట్లయింది. యింటికొచ్చాక యీ లోకంలోపడ్డా!.... ఆ రోజునుంచీ పాండీబజారంటే భయం!

ఎందుకంటే పాండీబజార్లో చెట్ల కింద మాట్లాడుకునే సినిమావాళ్లంతా చెట్లమీదవాళ్లా!.... కిందవాళ్లా!.... లేక పైవాళ్లూ, కిందవాళ్లూ కలిసి మాట్లాడుకొంటున్నారా అని నా సందేహం!